
# ఫోర్త్ డిగ్రీ

సూరేపల్లి విజయ



"సార్ ... ఆ బంధిపోటు భీమ్‌సింగ్ ఎన్ని చిత్రహింసలు, చిత్రవిచిత్రంగా పెట్టినా చెప్పడంలేదు, సార్! పైగా ఎప్పుడో పాతికేళ్లక్రితం వేసిన లాకప్ సీలింగ్ సిమెంటు పెచ్చులు ఊడిపోయేలా నవ్వుతున్నాడు కానీ, తాను జబల్‌పూర్ మహారాణి దగ్గర కొట్టేసిన కోటిరూపాయల వజ్రం గూర్చిమాత్రం చెప్పడంలేదు!" హెడ్‌కానిస్టేబుల్ చెమటలతో తడిసిపోతూ, విరిగిన నాలుగు లాఠీలనూ టేబుల్‌మీద పెడుతూ చెప్పాడు.

వారం రోజులక్రితం జబల్‌పూర్ మహారాణి పుట్టినరోజున బంధిపోటు భీమ్‌సింగ్ అతి తెలివిగా ఆ ఫంక్షన్‌కు వెళ్లి కిరీటంలో ఉన్న వజ్రాన్ని అతి లాఘవంగా కొట్టేశాడు. ఎట్టకేలకు దొంగ దొరికినా సమాచారం దొరకడంలేదు.

"థర్డ్ డిగ్రీ ఉపయోగించి చూడండి!" కరుగ్గా ఆర్డరిచ్చాడు అప్పుడే లోపలకు వచ్చిన ఎస్.పి. పరశురాం.

"అది కూడా అయిపోయింది, సార్! కానీ వాడు మాట్లాడితే మీ మీద ఒట్టు సార్!" అన్నాడు ఏడుపు గొంతుతో. బంధిపోటు భీమన్నను కొట్టీ

కొట్టీ అతని చేతులు నొప్పి పెట్టాయి. మళ్లీ సాయంత్రం ఇంట్లో ఆవిడకు కాళ్లు పట్టాలి. అదీ అతని బాధ! (అతనో భార్యా బాధితుడు మరి!)

అప్పుడే లోపలకి వచ్చాడు జేమ్స్‌బాండ్ ట్రిబుల్ సిక్స్. వస్తూనే, "అయితే ఫోర్త్ డిగ్రీ ప్రయోగించండి! చచ్చినట్టు నిజం చెప్పి చస్తాడు!" అన్నాడు.

"ఫోర్త్ డిగ్రీనా?" ఆశ్చర్యంగా అడిగాడు ఎస్పీ.

"ఎస్, యస్పీ!" అన్నాడు స్టయిల్‌గా జేమ్స్‌బాండ్.

"థర్డ్ డిగ్రీ కన్నా గొప్పదా?"

"డబుల్ గొప్పది! వాడేంటి ... ఈ ఫోర్త్ డిగ్రీతో ఇంటర్‌పోల్ వాంటెడ్ లిస్టులో ఉన్న క్రిమినల్స్‌తోనే నిజం చెప్పించాను!" రివాల్వర్ పేల్చి తన పెదవుల మధ్య ఉన్న సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు (సినిమాల్లో జేమ్స్‌బాండ్లు ఇలాంటి ట్రిక్స్ చేస్తూంటారు) జేమ్స్‌బాండ్.

"కమాన్! మన జేమ్స్‌బాండ్‌గారు చెప్పినట్లు ఫోర్త్ డిగ్రీ అప్లయ్ చేయండి!" ఆర్డర్స్ పాస్ చేశాడు ఎస్పీ బయటకు నడుస్తూ.

ఫోర్త్ డిగ్రీ ఏమిటో అర్థంకాక తన నెత్తిమీద ఉన్న రెండు వెంట్రుకలనూ పీక్కున్నాడు హెడ్ కానిస్టేబుల్.

జేమ్స్‌బాండ్ తన లాంగ్ కోటు జేబులోనుండి ఓ కాసెట్ తీసిచ్చాడు. "వి.సి.ఆర్., కలర్ టీ.వీ. తెప్పించి ఆ రూమ్‌లో పెట్టండి. ఆ తర్వాత ఈ కాసెట్‌ని వి.సి.ఆర్.లో ఇన్‌సర్ట్ చేసి ప్లే చేయండి! ఆ భీమ్‌సింగ్ కాళ్లూ చేతులూ కట్టేయండి! టీ.వీ. దగ్గరకు వెళ్లనీయద్దు! మీరు లాకప్‌కు తాళం వేసి బయట కూర్చుని బీడీలు కాల్చుకుంటూ ఉండండి. ఆ భీమ్‌సింగ్ 'నిజం చెబుతాను బాబోయ్!' అరిచి గీపెట్టేవరకూ లోపలకి వెళ్లద్దు. వాడు నిజం చెప్పాకే 'స్టాప్' బటన్ నొక్కండి. బట్ ... రిమెంబర్ వన్‌థింగ్! ఎటువంటి పరిస్థితుల్లోనూ మీరా కాసెట్ చూడద్దు!"

"హుఁ! స్కామ్‌లో, స్కాండిల్స్‌లో ఇరుక్కున్న వాళ్లకుండే ఫెసిలిటీస్ వీడికిస్తున్నాం! కలర్ టీ.వీ., వి.సి.ఆర్ ... ప్చ్ ... కొంపదీసి బ్లూ ఫిలిమ్ కాదు కదా! అయినా ఆ కాసెట్ చూడగానే వాడు నిజం ఎలా చెబుతాడు?" ఇలా ఆలోచిస్తూనే జేమ్స్‌బాండ్ చెప్పిన విధంగా అరేంజ్ చేసి ప్లే బటన్ నొక్కి, బయటకు వచ్చి కూర్చున్నాడు ఓ కానిస్టేబుల్.

లోపల,భీమ్‌సింగ్‌ని ఓ కుర్చీకి కట్టేశారు. ఎదురుగా టీ.వీ. ఆన్ అయింది. కాసెట్ పరుగెడుతోంది.

ఒకటి ... రెండు ... మూడు ... లోపలి గదిలోనుండి పెద్ద కేకలు ... అరుపులు! బయటకు వెళ్లబోయిన ఎస్పీ భయంగా లోపలకు పరుగెత్తుకు వచ్చాడు. భీమ్‌సింగ్ అరుస్తున్నాడు, ఏడుస్తున్నాడు, గింజుకుంటున్నాడు!

జేమ్స్‌బాండ్ చిద్విలాసంగా నవ్వుతున్నాడు.

పది ... ఇరవై ... ముప్పయ్ ... సరిగ్గా అరగంట కూడా గడవలేదు! చెవుల్లోనుండి రక్తం కారుతోంది భీమ్‌సింగ్‌కు. "నిజం చెప్పేస్తాను! ఆ వజ్రం మీకిచ్చేస్తాను!" అరుస్తున్నాడు భీమ్‌సింగ్.

● ● ●

భీమ్‌సింగ్ లొంగిపోయాడు. వజ్రం తిరిగిచ్చేసి, జీవితంలో దొంగతనం చేయననీ ప్రామిస్ చేశాడు బుద్ధిగా (భయంగా కూడా)!

● ● ●

"వెల్ డన్, జేమ్స్‌బాండ్! కానీ నా కో సందేహం ... పోలీసుల వల్ల, థర్డ్ డిగ్రీ వల్ల కానీ పనిని ఫోర్త్ డిగ్రీతో సాధించావు! ఇంతకీ ఏమిటా ఫోర్త్ డిగ్రీ?" అడిగాడు ఆసక్తిగా యస్పీ.

లాంగ్‌కోటు జేబులోనుండి వీడియో కాసెట్ తీసిచ్చాడు జేమ్స్‌బాండ్. దానిమీద 'తెలుగు సినిమాల్లోని హీరోల సినిమా కష్టాలు ప్లస్ దూరదర్శన్ కార్యక్రమాలు' అని ఉంది. జేమ్స్‌బాండ్ చెప్పడం ప్రారంభించాడు. "ఈ కాసెట్‌లో తెలుగు సినిమాల్లోని హీరోల సినిమా కష్టాల క్లిప్పింగ్స్, దూరదర్శన్‌లోని పందుల పెంపకం, ఆవు-పేడలాంటి కార్యక్రమాలు రికార్డు చేశాను. ఓరోజు అనుకోకుండా మా పనివాడు ఇది చూసి పిచ్చెక్కి పిచ్చాసుపత్రి-పాలయ్యాడు. వెంటనే ఐడియా క్లిక్ అయి, ఫోర్త్ డిగ్రీగా ఉపయోగిస్తూ వచ్చాను. తల్లికి క్షయ, తండ్రికి లుకేమియా, కూతురికి యాక్సిడెంట్, కొడుక్కి పోలియో ... ఇలా రకరకాల సినిమా కష్టాలమీద ఉన్న క్లిప్పింగ్స్ చూడటంతోనే పనిష్మెంట్ మొదటి స్టేజి మొదలవుతుంది. ఆ తర్వాత మెల్లమెల్లగా క్రిమినల్‌కి మెంటలెక్కడం గారంటీ!" అని కోటు జేబులోకి తోసి, "మళ్లీ దీని అవసరం వస్తే నాకు కబురుపెట్టండి!" అంటూ బయటకు నడిచాడు.

ఆరోజునుండి పోలీసు స్టేషన్సులో అఫీషియల్‌గా ఫోర్త్ డిగ్రీ అమల్లోకి వచ్చింది.

■



## ఒంటరిగా సల్మాన్!

ఈ మధ్య చుంకీ పాండే తన భార్యతో కలిసి సినీజనానికి ఓ పార్టీ యిచ్చాడు. దానికి మామూలుగా చాలామందే వచ్చారు. ఇక్కడ జరిగిన విశేషాలు రెండు. మొదటిది రేఖ చుంకీ పాండే బిడ్డను చూసుకోవటం. దాన్ని అంతగా ఎవ్వరూ పట్టించుకోలేదనుకోండి! మరి రెండోదాని సంగతే చెప్పుకోవాలి! అదేవిటీ అంటే... అంత సందడిలోనూ, సందోహంలోనూ ఒక్క వ్యక్తి మాత్రం విడిగా, ఒంటరిగా వేరే గదిలో కూర్చోవటం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. అతనెవరంటే పాపం, సల్మాన్ ఖానే! ఇటీవలే తన్నొదిలేసి యుఎస్‌వి కెళ్లిపోయిన సోమీఅలీతోనేమో కానీ, ఓ సెల్ ఫోన్‌లో ఆగకుండా మాట్లాడుతూ కనిపించాడు. అందరితో కలిసుంటే ఏమన్నా గొడవలొస్తాయనుకున్నట్టున్నాడు. ఇటీవల సల్మాన్‌లో మార్పు కనిపించిందండోయ్! అందరితోనూ మొరటుగా ప్రవర్తించే ఖాన్, చాలా మెత్తబడ్డాడు. అంతేకాదు, స్క్రీన్ అవార్డుల సందర్భంగా తన పేరును నామినేట్ చేయకపోయినా కూడాస్టేజిమీద ఓ షో ఇచ్చాడు. తమాషాగా జనమంతా ఎంతగానో ఆనందించారు ఆ కార్యక్రమాన్ని చూసి! మరి ఇదే ప్రారంభమనుకోవాలేమో అతని రాబోయే చిత్రాలు కూడా జనాదరణ పొందుతాయనటానికి!

ఎం.ఎ.